క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్‌: ప్రకాష్‌నగర్‌, హెచ్‌పీఎస్‌ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్‌ ఫీడర్‌ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బేగంపేట ఎరుకల బస్తీ, మెజిస్టిక్‌ మాన్షన్‌, జాగృతి అపార్ట్‌మెంట్స్‌, ఆర్‌బీఐ లేన్‌, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గురుమూర్తిలేన్‌, తాతాచారికాలనీ, ఆర్‌బీఐ క్వార్టర్స్‌, బొంబే హల్వా కాంపౌండ్‌, వరుణ్‌ మోటార్స్‌, సొనాటా, కట్టమైసమ్మ టెంపుల్‌, ఉమెన్స్‌ డిగ్రీ కాలేజ్‌, సూర్యోదయ బిల్డింగ్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ కోత ఉంటుందని పేర్కొన్నారు.

సమాజ సేవకు వాసవీ క్లబ్‌ పెద్ద పీట

అమీర్‌పేట: సమాజ సేవకు వాసవీ క్లబ్‌ పెద్ద పీట వేస్తోందని సినీ నిర్మాత తుమ్మల పల్లి రామసత్యనారాయణ అన్నారు. అమీర్‌పేట వాసవీ క్లబ్‌ వ్యవస్థాపక అధ్యక్షులు సింగారపు శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో సీఎంఆర్‌ అవార్డులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మల మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు వాసవీ క్లబ్‌ వెన్నంటి ఉంటూ రావడం సంతోషదాయకమని తెలిపారు. వారి అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్‌ డిస్టిక్‌ ఇంచార్జి కొత వెంకటేశ్వర్లు, గవర్నర్‌ నర్సింహులు, క్లబ్‌ మాజీ గవర్నర్లు ఎం.ఉపేందర్‌, శ్రీధర్‌, ప్రకాష్‌, ప్రాజెక్ట్‌ చైర్మన్‌ ఉదయ్‌ కిరణ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ విద్యార్థులకు మరో అవకాశం ఇవ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని వివిధ కోర్సుల్లో సకాలంలో పీహెచ్‌డీ పూర్తి చేయలేకపోయిన విద్యార్థులకు మరో అవకాశం ఇవ్వాలని ఎంఎస్‌ఎఫ్‌ రాష్ట్ర నాయకులు కొమ్ము శేఖర్‌మాదిగ అధికారులను కోరారు. సోమవారం ఓయూ క్యాంపస్‌లోని వివిధ కాలేజీల ప్రిన్సిపల్స్‌కు, డీన్లకు వినతి పత్రాలు సమర్పించారు. అనేక కారణాల వలన స్కాలర్స్‌ సకాలంలో పీహెచ్‌డీ పూర్తి చేయాలేక పోయారని 2018 బ్యాచ్‌కి పరిశోధన అంశాలను సమర్పించే గడువును ఏడాది పొడిగించాలని, 2016, 2017 విద్యార్థులకు పరిశోధన అంశాలను సమర్పించేందుకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జంగిలి దర్శన్‌, అరుణ్‌, సంధ్యారాణి, సంధ్య, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు, ఫుట్‌పాత్‌ ఆక్రమణలను సహించం

బన్సీలాల్‌పేట్‌: అక్రమ కట్టడాలను కూల్చివేస్తూ, ఫుట్‌పాత్‌ అక్రమణలను తొలగిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ బేగంపేట్‌ సర్కిల్‌ డిప్యూటీ సిటీ ప్లానర్‌ పి. సుష్మిత పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఫుట్‌పాత్‌ అక్రమణలను నిరంతర పక్రియగా సాగిస్తున్నామన్నారు. ట్రాఫిక్‌ పోలీసుల సహకారంతో ఆయా ప్రాంతాల్లో రోడ్లపై ఫుట్‌పాత్‌ అక్రమణలను తొలగిస్తున్నట్లు తెలియజేశారు. ప్రజలు, పాదచారులకు ఇబ్బంది కలిగే విధంగా ఉన్న ఫుట్‌పాత్‌లను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఫుట్‌పాత్‌ల అక్రమణ, అక్రమ నిర్మాణాల కూల్చివేత అనేక కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియ కొనసాగిస్తున్నామని డీసీపీ సుష్మిత చెప్పారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

సనత్‌నగర్‌: ధనుర్మాస ఉత్సవాలు సనత్‌నగర్‌ హనుమాన్‌ దేవాలయం శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 15వ రోజు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలతో పాటు తిరుప్పావై పాశురాల పారాయణం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కాటం శ్రీనివాస్‌గౌడ్‌ పాల్గొన్నారు.

హాస్టల్‌ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

అమీర్‌పేట: ప్రైవేటు హాస్టల్‌ నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్‌ఆర్‌ నగర్‌ డివిజన్‌ ఏసీపీ వెంకటరమణ అన్నారు. సోమవారం స్టేషన్‌ పరిధిలోని హాస్టల్స్‌ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.నిరంతరం అప్రమత్తంగా ఉండటంతో పాటు పోలీసులకు సహకరించి నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు.

నిఘా నేత్రం పట్టేస్తోంది



కేసుల ఛేదనలో 'కీ'లకంగా సీసీ కెమెరాలు

- బేగంపేట ఏసీపీ లిమిట్స్‌లో 72.4 శాతం రికవరీ
- సీసీ కెమెరాలతోనే ఇది సాధ్యమైందంటున్న పోలీసులు..
- ఒక సీసీ ఫుటేజీ 62 బైక్‌ల స్వాధీనానికి కారణమైంది
- మరో సీసీ ఫుటేజీ హత్య కేసులో ఎనిమిది మందిని పట్టించింది
- ఇలా ఎన్నెన్నో కేసుల్లో పురోగతికి సీసీ కెమెరాలు దోహదం

సనత్‌నగర్‌: గత కొన్ని రోజుల క్రితం బేగంపేటలోని కుమార్‌వేలు బ్రదర్స్‌ అనే డిస్ట్రిబ్యూటర్‌ కంపెనీలో పనిచేసే మెగావత్‌ కృష్ణ రోజువారీ జమ అయ్యే నగదును బ్యాంక్‌లో డిపాజిట్‌ చేసే క్రమంలో రూ.2 లక్షలు తీసుకెళ్తుండగా ముగ్గురు యువకులు వెంబడించి దోచుకెళ్లారు. సంఘటన జరిగిన ప్రాంతం నుంచి 15 కిలోమీటర్ల మేర 400 సీసీ కెమెరాలను జల్లెడ పట్టి నిందితులను ఉప్పల్‌ చిలుకానగర్‌ వద్ద అరెస్టు చేశారు.

- బీఎస్‌ఎన్‌ఎల్‌, బ్యాంకింగ్‌లకు చెందిన కేబుల్స్‌ను దొంగిలిస్తూ వినియోగదారులకు, బ్యాంక్‌ లావాదేవీలకు నానా ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి. ఈ నేపథ్యంలో బీఎస్‌ఎన్‌ఎల్‌ అధికారుల ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకుని 350 కిలోల కాపర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- బేగంపేట పాటిగడ్డలో జరిగిన పరువు హత్య సంచలనం రేపింది. అయితే ఈ ఘటనలో నిందితులెవరన్నది మృతుడి బంధువులు కొంతమందిపై అనుమానం వ్యక్తం చేసినా ఆధారాలు లేవు. దీంతో అప్పుడు సీసీ ఫుటేజీలే ఆధారంగా నిలిచి నిందితులను పట్టించాయి.
- ఒక బైక్‌ను దొంగిలిస్తుండగా సీసీ ఫుటేజీలో నమోదైన దృశ్యం ఆధారంగా నిందితుడిని పట్టుకుంటే 62 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రోజుకొక బైక్‌ను దొంగిలిస్తూ వెళ్లిన ఆ దొంగ ఆచూకీ ఎక్కడా దొరకకపోతే చివరకు సీసీ ఫుటేజీయే పట్టించింది.

ఇలా ఒక్కటి కాదు..రెండు కాదు..వందల సంఖ్యలో కేసుల ఛేదనలో సీసీ కెమెరా 'కీ'లకంగా మారింది. పోలీసుల దర్యాప్తులో అన్ని దారులూ మూసుకుపోయినా నిఘానేత్రం నేనున్నానంటూ కేసులను కొలిక్కి తీసుకువస్తోంది. ఈ ఏడాది కాలంలో పోలీసులు ఎన్నో కేసులను సీసీ ఫుటేజీల ఆధారంగా ఛేదించారంటే రెప్పవాల్చని ఆ మూడో కన్ను పనితీరు చెప్పకనే చెబుతోంది. హత్యలు, దొంగతనం, దోపిడీ, స్నాచింగ్‌, యాక్సిడెంట్స్‌...ఇలా సంఘటన ఏదైనా సరే...నేరగాళ్ల ఆటకట్టించడంలో కనిపించని నిఘా నేత్రం ప్రధాన భూమిక పోషించింది.

బేగంపేట పోలీసు డివిజన్‌ పరిధిలో 4,877 కెమెరాలు..

బేగంపేట పోలీసు డివిజన్‌ పరిధిలోని బేగంపేట, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 4,877 కెమెరాలతో నిఘా కొనసాగుతోంది. వీటిలో పోలీస్‌ కమాండ్‌ కంట్రోల్‌కు అనుసంధానంగా ఏర్పాటుచేసిన 129 సీసీ కెమెరాలను ఎల్‌ అండ్‌ టీ నిర్వహిస్తోంది. ఈ సీసీ కెమెరాలు నేరుగా పోలీస్‌స్టేషన్లకు అనుసంధాని ఉండడంతో పోలీసు సిబ్బంది నేరుగా ఆయా పోలీస్‌స్టేషన్ల నుంచే 24 గంటల పాటు నిరంతర పర్యవేక్షణ జరుగుతుంది. రెండు పోలీస్‌ స్టేషన్లలో 450 కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిని ఆయా కాలనీలు, వ్యాపార సంస్థలు, వివిధ సంఘాలు ఏర్పాటుచేసుకున్నాయి. ఇక 'నేను సైతం' ప్రాజెక్ట్‌ కింద బేగంపేట డివిజన్‌ పరిధిలో 4,298 సీసీ కెమెరాలు ఉన్నాయి.

బేగంపేట పీఎస్‌ పరిధిలోనే అధికం..

నగర కమిషనరేట్‌ పరిధిలోనే అత్యధిక సీసీ కెమెరాలు కలిగిన పోలీస్‌స్టేషన్‌లలో బేగంపేట ఒకటి. ఒకవైపు వీవీఐపీ, వీఐపీల రాకపోకలు ఎక్కువగా సాగే బేగంపేట మార్గంలో పోలీసులు ఎక్కువ సమయం బందోబస్తు నిర్వహణకే సరిపోతుంది. అయినప్పటికీ రికార్డు స్థాయిలో కేసులను ఛేదించారంటే సీసీ కెమెరాలతోనే సాధ్యపడిందనేది సుస్పష్టం. ఈ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో కంట్రోల్‌ రూమ్‌కు అనుసంధానించబడి ఎల్‌ అండ్‌ టీ నిర్వహించే 85 కెమెరాలతో పాటు 275 కమ్యూనిటీ, 2,515 నేనుసైతం కెమెరాలు ఉన్నాయి.

72.4 శాతం రికవరీ..

బేగంపేట డివిజన్‌ పరిధిలో 2024లో 72.4 శాతం రికవరీ జరిగిందంటే అది సీసీ కెమెరాల కారణంగానే జరిగిందని చెప్పవచ్చు. పరేడ్‌గ్రౌండ్‌ వద్ద జరిగిన బైక్‌ దొంగతనంలో నిందితుడిని పట్టించిన కెమెరా 62 బైక్‌ల స్వాధీనానికి కారణంగా నిలిచింది. అలాగే బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సైతం ఇదే తరహా సంఘటనలో బైక్‌ దొంగను పట్టుకునేందుకు ఏకంగా 600 సీసీ కెమెరాలను చెక్‌ చేసుకుంటూ వెళ్లగా చివరకు పట్టుకుని అతని నుంచి 12 వాహనాలను పట్టుకున్నారు. ఇలా నిందితులను పట్టుకోవడంతో పాటు సొత్తు రికవరీ చేయడంలో సీసీ కీరోల్‌గా మారింది.

ఎన్నో కేసుల్లో సీసీ కెమెరాలు కీలకంగా మారాయి



సీసీ కెమెరాలతో పాటు పీడియాక్ట్‌, బైండోవర్ల కారణంగా క్రైమ్‌ రేటు చాలావరకు తగ్గింది. స్నాచ్‌స్నాచింగ్స్‌ పూర్తి స్థాయిలో తగ్గిపోయాయి. సీసీ కెమెరాల ప్రాధాన్యత గురించి తెలుసుకుని కాలనీల అసోసియేషన్లు, పౌరులు బాధ్యతగా ముందుకువచ్చి స్వచ్ఛందంగా కెమెరాలను ఏర్పాటుచేసుకుంటున్నారు. ఇది శుభపరిణామం. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాల పనితీరుపై కూడా బ్లూకోల్ట్స్‌, పెట్రోలింగ్‌ సిబ్బంది దృష్టిసారిస్తూ ఎప్పటికప్పుడు వాటిని పునరుద్ధరించేలా చూస్తున్నారు. కాలనీ అసోసియేషన్లు కామన్‌ పాయింట్‌తో పాటు కాలనీ ఎంట్రీ, ఎగ్జిట్‌ ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవాలి.

– బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి..

సీతాఫల్‌మండి సెట్విన్‌ విస్తరణకు ప్రణాళికలు



సెట్విన్‌ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావు

చిలకలగూడ : సీతాఫల్‌మండి సెట్విన్‌ సెంటర్‌ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు సికింద్రాబాద్‌ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌ తెలిపారు. ప్రస్తుత సెట్విన్‌ భవనంపై చేపట్టిన అదనపు అంతస్తు నిర్మాణ పనులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. సీతాఫల్‌మండి సెట్విన్‌ సెంటర్‌లో దశాబ్ధకాలంగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, విద్యార్థులకు అనేక అంశాల్లో శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. మరిన్ని కొత్త కోర్సులను ప్రారంభించేందుకు వీలుగా సెట్విన్‌ భవనంపై అదనపు అంతస్తు నిర్మిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సీతాఫల్‌మండి సెట్విన్‌ సెంటర్‌ ఇంచార్జి అనిత పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌ రామస్వామికి ఘన నివాళి



రామస్వామికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్‌ మహాసభ నాయకులు

పద్మారావునగర్‌: సికింద్రాబాద్‌ బోయిగూడ ముదిరాజ్‌ సంఘంలో సోమవారం మాజీ కార్పొరేటర్‌ రామస్వామి ముదిరాజ్‌ వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్‌ మహాసభ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముదిరాజ్‌ మహాసభ నాయకులు రామస్వామి చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్‌ మహాసభ నాయకులు సదానందం, గోవింద రాములు, పి. వెంకటేష్‌, టి. సురేందర్‌, శ్రీనివాస్‌, పృధ్వీరాజ్‌, లక్ష్మణ్‌, సుదర్శన్‌, రాజారామ్‌, సత్యం తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అధికారులు,ప్రతినిధులు

అమీర్‌పేట: రాజ్యాంగ బద్ధంగా వచ్చిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని అమీర్‌పేట డిప్యూటీ తహసీల్దార్‌ మాధవి తెలిపారు. సివిల్‌ రైట్స్‌ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం డివిజన్‌లోని బౌద్ధనగర్‌లో హక్కులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి పౌరుడు భారత రాజ్యాంగాన్ని చదవాలన్నారు. కార్యక్రమంలో హక్కుల సంఘం ప్రతినిధులు అనంత్‌రెడ్డి, దళిత సంఘం నాయకులు కటకటం భాస్కర్‌ పాల్గొన్నారు.

అన్నివేళలా అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌



ఎమ్మెల్యే తలసానిని కలిసిన ఉదయ్‌నగర్‌ కాలనీ నూతన కమిటీ సభ్యులు

సనత్‌నగర్‌: కాలనీల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను అన్నివేళలా అండగా ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన సనత్‌నగర్‌ ఉదయ్‌నగర్‌ కాలనీ నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నూతన అధ్యక్షుడు విష్ణువర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి శ్యాంసుందర్‌, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సంతోష్‌ పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయండి



చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్‌ సామల హేమ కోరారు. ఈమేరకు జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. అంతర్గత రహదారులు, నిధుల మంజూరు, అభివృద్ధి నిర్మాణ పనులు, అర్థాంతరంగా ఆగిన కమ్యూనిటీహాల్స్‌ నిర్మాణాలు, పారిశుధ్యం తదితర అంశాలపై చర్చించామని, జోనల్‌ కమిషనర్‌ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్‌ హేమ తెలిపారు. డివిజన్‌లో నెలకొన్న ప్రజాసమస్యలు తనదృష్టికి తెస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

నూతన సంవత్సరం సుఖసంతోషాలు నింపాలి



సనత్‌నగర్‌: నూతన సంవత్సరం ప్రతి ఇంటా సుఖసంతోషాలు నింపాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ ఆకాంక్షించారు. సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద లష్కర్‌ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్‌ ఆధ్వర్యంలో పద్మారావునగర్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు మహేందర్‌ రూపొందించిన నూతన సంవత్సర కేలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నేతలు వెంకటేషన్‌రాజు, శైలేందర్‌, రమణ, మహేందర్‌గౌడ్‌, అశోక్‌రెడ్డి, వినోద్‌, ముక్కా శ్రీనివాస్‌, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

బస్తీలో ఆస్పత్రి నిర్మించండి



ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మాణికేశ్వరీ నగర్‌ కమిటీ సభ్యులు

లాలాపేట: తార్నాక మున్సిపల్‌ డివిజన్‌ పరిధిలోని మాణికేశ్వరినగర్‌ బస్తీవాసులు సోమవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిశారు. బస్తీలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాణికేశ్వరీ నగర్‌ బస్తీ నాయకులు మాట్లాడుతూ స్థానిక ప్రజల సౌకర్యార్థం బస్తీలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలని కోరుతూ గతంలో కొద్ది నెలల పాటు దీక్ష చేశామని గుర్తు చేశారు. ఆస్పత్రి నిర్మిస్తామని అప్పట్లో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల ప్రచార సమయంలో బస్తీలో ప్రభుత్వ దవాఖాన నిర్మిస్తామని కాంగ్రెస్‌ నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ మేరకు మాణికేశ్వరీ నగర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ ప్రతిపాదనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిర్మాణ పనులను ప్రారంభించేలా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించిన వారిలో బస్తీ నాయకులు ఏ. శ్రీనివాస్‌, వరికుప్పల రవి, గండికోట వెంకటేష్‌, లింగయ్య, అశోక్‌, నర్సింహ్మా, ముత్తయ్య, కే. నరసింహ తదితరులు ఉన్నారు.

కంటోన్మెంట్‌లో రాచరిక పాలన సాగుతోంది

కంటోన్మెంట్‌: సికింద్రాబాద్‌ కంటోన్మెంట్‌లో రాచరిక పాలన సాగుతోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ మండిపడ్డారు. పదేళ్లుగా కంటోన్మెంట్‌ బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా కేంద్రం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. బీజేపీకి చెందిన వ్యక్తి రామకృష్ణను బోర్డు నామినేటెడ్‌ సభ్యుడిగా నియమించి అరాచక పాలన కొనసాగిస్తోందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బోర్డు సమావేశం అనంతరం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని కంటోన్మెంట్‌ బోర్డు సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఉండే ఎంపీ, ఎమ్మెల్యేకు మాట్లాడే హక్కు లేదు అంటూ బోర్డు సభ్యుడు ప్రస్తావించడం వారి నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. తన నియోజకవర్గంలో 90 శాతం ప్రాంతం కంటోన్మెంట్‌ బోర్డు పరిధిలోనే ఉంటుందన్నారు. డీమ్డ్‌ మున్సిపాలిటీగా కొనసాగే కంటోన్మెంట్‌లో ప్రజాప్రతినిధులైన ఎంపీ, ఎమ్మెల్యేకు మాట్లాడే అవకాశం లేదంటే, అసలు సమావేశాలకు పిలవడంలో ఆంతర్యమేంటన్నారు. నామినేటెడ్‌ సభ్యుడు తన స్థాయిని మరిచి, ఏకంగా ఎమ్మెల్యేనైన తనకే అవగాహన క్లాసులు చెబుతానని చెప్పడం ఆయన అహంకారాన్ని సూచిస్తోందన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్‌: హుస్సేన్‌ సాగర్‌లో ఇటీవల జరిగిన స్టేట్‌ సెయిలింగ్‌లో సత్తా చాటిన ఓల్డ్‌ నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ పాఠశాలకు చెందిన 4వ తరగతి చదువుతున్న అర్షిన్‌ అహ్మద్‌ స్టేట్‌ సబ్‌ జూనియర్‌ చాంపియన్‌ బాలికల విభాగంలో రెండవ స్థానం దక్కించుకుంది. అలాగే 5వ తరగతి చదువుతున్న యువరాజ్‌ గుప్తా స్టేట్‌ సబ్‌ జూనియర్‌ చాంపియన్‌షిప్‌లో రెండవ స్థానం దక్కించుకున్నారు.

వ్యక్తి అదృశ్యం

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ శంకర్‌ నాయక్‌ తెలిపిన మేరకు.. తుకారాంగేట్‌లోని సుభాష్‌ బొమ్మ సమీప ప్రాంతానికి చెందిన సాయిబాబా(58) అనే వ్యక్తి ఈ నెల 29న తన భార్యతో గొడవపడి ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబభ్యులు సోమవారం తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్‌ నేత మృతి

అడ్డగుట్ట: గుండెపోటుతో బీఆర్‌ఎస్‌ నేత మృతి చెందాడు. శాంతినగర్‌ ప్రాంతానికి చెందిన బీఆర్‌ఎస్‌ నేత బాబురావుకు ఆదివారం రాత్రి గుండె పోటు వచ్చింది. దీంతో అతన్ని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్‌: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ ఎదురుగా గల ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడివుందన్న సమాచారం మేరకు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్ల విస్తరణకు బోర్డు ఆమోదం

- 60 మీటర్లకు విస్తరణకు అంగీకారం
- తాగునీటి సరఫరా బాధ్యతను ప్రభుత్వానికి అప్పగించాలన్న ఎమ్మెల్యే
- బోర్డు సమావేశంలో పలు కీలక పనులకు ఆమోదం



కంటోన్మెంట్‌: కంటోన్మెంట్‌ పరిధిలో చేపట్టనున్న రెండు ఎలివేటెడ్‌ కారిడార్ల నిర్మాణానికి 60 మీటర్ల మేరకు రోడ్డు విస్తరణకు కంటోన్మెంట్‌ బోర్డు ఆమోదం తెలిపింది. రోడ్డు విస్తరణను 60 మీటర్లకు బదులుగా, 40 మీటర్లకు కుదించాలంటూ గతంలో బోర్డు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ససేమిరా అంది. దీంతో సోమవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో హెచ్‌ఎండీఏ అధికారుల సమక్షంలో మరోసారి ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించిన బోర్డు ఎట్టకేలకు 60 మీటర్ల మేరకు రోడ్డు విస్తరణకు అంగీకారం తెలిపింది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్‌ నంజుండేశ్వర సారథ్యంలో జరిగిన బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో పాటు, సీఈఓ మధుకర్‌ నాయక్‌, జాయింట్‌ సీఈఓ పల్లవి విజయ్‌ వర్మ్నీ, బోర్డు సభ్యుడు రామకృష్ణ పాల్గొన్నారు.

ఏమేం చర్చించారంటే?

రోడ్ల విస్తరణపై..

- జాతీయ రహదారి 44, రాష్ట్ర రహదారి 1 మార్గాల్లో చేపట్టనున్న రోడ్డు విస్తరణను ప్రైవేటు స్థలాలు ఉన్న చోట 60 మీటర్లకు బదులుగా, 40 మీటర్లకు కుదించాలని బోర్డు సభ్యుడు రామకృష్ణ మరోసారి ప్రస్తావించారు. మార్కెట్‌ వ్యాల్యూ ప్రకారం కాకుండా అధిక మొత్తంలో పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు.

తాగునీటి బాధ్యత రాష్ట్రానికి ఇవ్వండి..

కంటోన్మెంట్‌ పరిధిలో రోజుకు అదనంగా 10 లక్షల గ్యాలన్‌ల చొప్పున నీటిని విడుదల చేస్తున్నప్పటికీ, కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విషయంలో వాస్తవాలు వెల్లడించాల్సిందిగా ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ బోర్డు అధికారులను కోరారు. కంటోన్మెంట్‌కు గతంలో రోజుకు 5.9 మిలియన్‌ గ్యాలన్‌ల నీరు మాత్రమే సరఫరా అయ్యేదని, ప్రస్తుతం 6.9 మిలియన్‌ గ్యాలన్‌లు అందుతుందని బోర్డు అధికారులు పేర్కొన్నారు. తాగునీటి సరఫరా బాధ్యతలను పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలన్న ప్రతిపాదనకు బోర్డు సానుకూలంగా స్పందించింది. త్వరలోనే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని సీఈఓ తెలిపారు. తాగునీటి బకాయిలకు సంబంధించి ప్రవేశపెట్టిన వన్‌టైమ్‌ సెటిల్‌మెంట్‌ స్కీము (ఓటీఎస్‌) గడువును జనవరి 31 వరకు పెంచడానికి ఆమోదిస్తూనే, ఎగవేతదారులకు మినహాయింపులు ఇవ్వడం పట్ల బోర్డు అధ్యక్షుడు నంజుండేశ్వర అసహనం వ్యక్తం చేశారు.

టీపీటీ, సర్వీసు చార్జీలపై

ట్రాన్స్‌ఫర్‌ ఆఫ్‌ ప్రాపర్టీ (టీపీటీ) ఆదాయం గతంలో మాదిరిగా నేరుగా కంటోన్మెంట్‌కు చెల్లించేలా ప్రతిపాదన వస్తే, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు.

సమాన విలువైన పరిహారం ఇవ్వాలి

ఎలివేటెడ్‌ కారిడార్‌ కోసం సేకరించే ప్రైవేటు ఆస్తులకు సంబంధించి సమాన విలువ కలిగిన పరిహారం ఇవ్వాలని బోర్డు సభ్యుడు రామకృష్ణ కోరారు. గత పదేళ్లుగా కంటోన్మెంట్‌లో మార్కెట్‌ వ్యాల్యూ పెరగలేదని, ఈ నేపథ్యంలో మార్కెట్‌ వ్యాల్యూ ప్రకారం పరిహారం ఇస్తే బాధితులకు భారీ నష్టం వాటిల్లుతుందని అన్నారు. బాధితులకు మార్కెట్‌ వ్యాల్యూకంటే అధిక మొత్తంలో పరిహారం ఇప్పించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ తెలిపారు.

ఎన్నికల కోసం ఎమ్మెల్యే పట్టు

- కంటోన్మెంట్‌లో పదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం తగదని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ అన్నారు. తక్షణమే బోర్డు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌ చేశారు.
- జూబ్లీ బస్‌స్టేషన్‌ ఆవరణలోని స్థలాన్ని ఐదేళ్ల పాటు పార్కింగ్‌ కోసం లీజు ఇచ్చేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.